క్లుప్తంగా

ప్రాజెక్టు అధికారి శ్రీనివాస్ బదిలీ

కుత్బుల్లాపూర్: ప్రాజెక్టు అధికారిగా విధులు నిర్వర్తించిన శ్రీనివాస్ బదిలీపై కాప్రా సర్కిల్‌కు వెళ్లారు. ఇక్కడ విధులు నిర్వర్తించిన సమయంలో పలు గ్రూపు సభ్యులకు రుణాలు అందించే విషయంలో తనదైన శైలిలో ముద్ర వేసుకున్నారు. కుత్బుల్లాపూర్ సర్కిల్‌లో కోట్లాది రూపాయల పావలా వడ్డీ రుణాలను ఇప్పించే ప్రక్రియలో విజయం సాధించగా అధికారులు ప్రశంస పత్రాలు అభినందనలు తెలిపిన విషయం తెలిసిందే. శ్రీనివాస్ కాప్రా సర్కిల్‌కు బదిలీ కావడంతో గాజులరామారం ప్రాజెక్టు అధికారిగా ఉన్న హరిప్రియకు ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు.

గురుకులంలో అడ్మిషన్లు షురూ

నిజాంపేట్: నిజాంపేట్ కార్పొరేషన్ బాచుపల్లిలోని మైనార్టీ గురుకుల పాఠశాల, కళాశాలల్లో 2023–24 విద్యా సంవత్సర అడ్మిషన్లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. కుత్బుల్లాపూర్ బాయ్స్ పాఠశాలలో 5వ తరగతిలో ప్రవేశానికి ముస్లిం (24), ఎస్సీ (02), ఎస్టీ (03), బీసీ (05), ఓసీ (02) మొత్తం 36 సీట్లు, జూనియర్ ఇంటర్ ఎంఇసీలో ముస్లిం (25), ఎస్సీ (01), ఎస్టీ (02), బీసీ (02), ఓసీ (01) మొత్తం 31 సీట్లు, సీఈసీ జూనియర్ ఇంటర్‌లో ఎస్టీ (02), బీసీ (02), ఓసీ (01) మొత్తం 5 సీట్లు ఉన్నాయని, ఔత్సాహిక విద్యార్థులు ఇతర వివరాలకు 9553158618/ 7331170803 నెంబర్లలో సంప్రదించాలని ప్రిన్సిపాల్ కోరారు.

కంటి వెలుగుకు విశేష స్పందన

కుత్బుల్లాపూర్: జంట సర్కిళ్ల పరిధిలో కంటి వెలుగుకు విశేష స్పందన లభిస్తోంది. శుక్రవారం గాజులరామారం సర్కిల్ పరిధిలోని ఉషోదయ కాలనీ కమ్యూనిటీ హాలు, మగ్దూమ్‌నగర్‌లోని సాయి కల్యాణ మండపం, భగత్‌సింగ్‌నగర్‌లోని మల్టీపర్పస్ ఫంక్షన్‌హాలు, సూరారం అంబేడ్కర్ భవన్‌లలో 565 మందికి, కుత్బుల్లాపూర్ సర్కిల్ పరిధిలోని గాంధీనగర్ కమ్యూనిటీ హాలు, సూరారం కాలనీ లూయిస్‌బ్రెయిలీ కమ్యూనిటీ హాలు, సుభాష్‌నగర్ బస్తీ దవాఖానా, పద్మానగర్ కమ్యూనిటీ హాలు, దుర్గా ఎస్టేట్స్ కమిటీ హాలు లోని సెంటర్లలో 709 మందికి మొత్తం 1274 మందికి పరీక్షలు చేసినట్లు అధికారులు తెలిపారు.

వేడుకగా బొడ్రాయి ప్రతిష్ఠాపన

దుండిగల్: దుండిగల్ తండా–1లో శుక్రవారం నాభిశీల బొడ్రాయి ప్రతిష్ఠాపన మహోత్సవం వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి కౌన్సిలర్లు శంభీపూర్ కృష్ణ, శంకర్ నాయక్ హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బొడ్రాయి ఏర్పాటుతో స్థానికంగా ప్రజలకు మంచి జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో 27వ వార్డు ప్రెసిడెంట్ అమర్ సింగ్, నాయకులు రవీందర్‌నాయక్, భీమ్‌సింగ్, వెంకటేష్‌నాయక్, జగన్‌నాయక్, మహేందర్‌నాయక్, రెడ్యానాయక్, రోషన్‌నాయక్, కుమార్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

సత్కారం


ఉప్పల హరిగోపాల్‌ను సత్కరిస్తున్న దృశ్యం

కుత్బుల్లాపూర్: తెలంగాణ రాష్ట్ర నాయీ బ్రాహ్మణ సేవా సంఘం యూత్ ప్రెసిడెంట్‌గా కుత్బుల్లాపూర్ ప్రాంతానికి చెందిన ఉప్పల హరి వేణుగోపాల్ నియమితులయ్యారు. అదే విధంగా గాజులరామారం గ్రామానికి చెందిన ఉప్పల భీమ్‌రావునాయీ రాష్ట్ర నాయీ బ్రాహ్మణ సేవా సంఘం ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యారు. శుక్రవారం కుత్బుల్లాపూర్ ప్రాంత నాయీ బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో ఉప్పల హరివేణుగోపాల్‌ను సత్కరించారు. నాయీ బ్రాహ్మణుల సంక్షేమంతో పాటు ఆర్థికంగా, రాజకీయంగా ఎదిగేందుకు కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు.

ఇన్వెంట్రాన్ 2కే23 హ్యాకథాన్ షురూ



దుండిగల్: దుండిగల్‌లోని ఎంఎల్‌ఆర్‌ఐటీ కళాశాలలో ఇన్వెంట్రాన్ 2కే23 పేరిట 36 గంటల పాటు జరిగే జాతీయ స్థాయి హ్యాకథాన్‌ను శుక్రవారం వ్యాక్సన్ యూనివర్సిటీ స్టార్టప్ ఇంక్యూబేషన్ సెంటర్ హెడ్ కశ్యప్ కంపెల్లా ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. కళాశాలకు చెందిన సెంటర్ ఫర్ ఇన్నోవేషన్ అండ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ (సీఐఈ) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ హ్యాకథాన్‌లో 600 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కళాశాల సెక్రటరీ మర్రి రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులు తమ సొంత వ్యాపారాలను ప్రారంభించడానికి అవసరమైన సాధనాలను అందించడం ద్వారా సీఐఈ సహాయం చేస్తోందన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీనివాసరావు మాట్లాడుతూ.. ఇన్వెంట్రాన్ 2కే23 ద్వారా విద్యార్థుల సృజనాత్మకతను వెలికితీస్తాయని అన్నారు. హ్యాకథాన్‌లో వినూత్న ఆలోచనలు, ఆవిష్కరణలకు రూపకల్పన చేసే విద్యార్థులకు రూ.75 వేలు ప్రోత్సాహక బహుమతి ఇస్తామనానారు. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మన్ మర్రి రాజశేఖర్‌రెడ్డి, డైరెక్టర్ మర్రి అనుశ్రేయారెడ్డి, వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

నేడు రథ సప్తమి

సూర్య నమస్కారం చేద్దాం.. ఆరోగ్య భారత్‌ను నిర్మిద్దాం

జనవరి 28న ఒక విశేషం ఉంది. మాఘ మాసంలో వచ్చే విశేష పండగలలో రథ సప్తమి ఒకటి. సూర్య భగవానుడి పుట్టినరోజు సందర్భంగా చాలా మంది ప్రత్యేక పూజలు చేస్తారు. రథసప్తమి ఉదయం సూర్యరష్మిలో సూర్య నమస్కారాలు చేస్తారు. నేటి యాంత్రిక జీవనంలో చాలా మంది వ్యాయామం మర్చిపోయారు. అందులో సూర్య నమస్కారాల గురించి పూర్తిగా మర్చిపోయారు. సూర్య నమస్కారం అంటే సూర్యుడికి దండం పెట్టడమని చాలా మంది అనుకుంటారు. కాని సూర్యుడిని నమస్కరిస్తూ 12రకాల ఆసనాలు చేస్తూ సూర్య భగవానుడిని నమస్కరిస్తారనేది తెలుసుకోవాలి. ఇప్పటి నుంచి సూర్య నమస్కారం చేద్దాం.. ఆరోగ్య భారత్‌ను నిర్మిద్దాం. రథ సప్తమిని పురస్కరించుకొని సూర్య నమస్కారంపై ప్రత్యేక కథనం.


సూర్య నమస్కారాలు చేస్తున్న దృశ్యం

సుభాష్‌నగర్: ఇప్పటి వరకు పాశ్చాత్య వ్యాయామాలు, ఏరోబిక్స్, జుంబా డ్యాన్స్‌లకు అలవాటు పడిన నేటి యువత యోగా, సూర్య నమస్కారం ప్రాముఖ్యతను తెలుసుకుంటున్నారు. దీంతో ఏరోబిక్స్, జుంబా సెంటర్లలో సైతం సూర్య నమస్కారాన్ని భాగం చేయడం విశేషం. భారతీయులుగా మనం సూర్య నమస్కారం చేయడం నేర్చుకుని తమ జీవితంలో భాగం చేసుకోవాలి. సూర్య రష్మిలో చేస్తే ఎముకలు మరింత దృఢంగా తయారవుతాయని యోగా గురువులు పేర్కొంటున్నారు. మన పూర్వీకులు ఇచ్చిన ఈ ఆరోగ్య రహస్యాన్ని అందిపుచ్చుకుని భవిష్యత్ తరాలకు అందించాల్సిన అవసరం ఎంతైన ఉంది.

సూర్య నమస్కారాల ప్రాముఖ్యత..

వ్యాయామాల్లోకెల్లా అత్యంత ఉత్తమమైన వ్యాయామ ప్రక్రియ సూర్య నమస్కారాలు అని చెప్పుకోవచ్చు. ఈ నమస్కారాల వల్ల కాలి వేలి నుంచి తల వెంట్రుకల వరకు శరీరంలోని అన్ని అవయవ, ఎముకలకు వ్యాయామం కలిగించి శక్తిని ఇచ్చే ఒకే ఒక ప్రక్రియ సూర్య నమస్కారాలు. ఉచ్ఛ్వాస, నిశ్వాస దృష్టి కేంద్రీకరించి సూర్య నమస్కారాలు (12 రకాల ఆసనాలు) చేస్తారు. 12 రకాల ఆసనాలు చేయడం వచ్చిన తర్వాత సూర్య నమస్కార మంత్రం జపిస్తూ ఆసనాలు వేస్తారు.

సూర్యునికి ఇష్టమైనది..

ఎవరైతే ఆరోగ్యవంతులు కావాలని అనుకుంటున్నారో నిత్యం సూర్య ఆరాధన చేయాలని యోగ గురువులు సూచిస్తున్నారు. ఆరోగ్యానికి అధిపతి అయిన సూర్య భగవానునికి ఉదయం సూర్య నమస్కార (12ఆసనాల మిళితం) చేస్తే అనారోగ్యం బారిన పడరని బల్ల గుద్ది చెబుతున్నారు యోగా గురువులు.

సూర్య నమస్కారాల వల్ల ఉపయోగాలు..

- సంపూర్ణ శరీరానికి వ్యాయామం జరుగుతుంది.
- కండరాలు దృఢంగా తయారవుతాయి.
- పిల్లలు పొడవుగా పెరుగుతారు.
- దృఢమైన శరీరంతో దృఢమైన మనసును పొందుతారు.
- చక్కెర వ్యాధి అదుపులో ఉంటుంది.
- అధిక బరువు తగ్గి మంచి శరీరాకృతిని పొందుతారు.
- కొలెస్ట్రాల్, ఫ్యాట్లు తగ్గుతాయి.
- సూర్య రష్మిలో చేయడం వలన అధిక మొత్తంలో విటమిన్ డీ3 ని పొందుతారు.
- ఎండోక్రైన్ సిస్టమ్‌లోని లోపల తొలగిపోతాయి.
- శరీరం ఆరోగ్యవంతంగా శక్తివంతంగా తయారవుతుంది.
- పొట్ట, పేగులు, జీర్ణాశయం వంటి జీర్ణవ్యవస్థ ఆరోగ్యంగా తయారవుతుంది.
- ఊపిరితిత్తుల సమస్యలు తగ్గుతాయి.
- చెడు కొలెస్ట్రాల్ కరిగిపోవడం వలన గుండె ఆరోగ్యవంతంగా ఉంటుంది.
- వెన్నెముక, మెడ సంబంధిత సమస్యలు తొలగిపోతాయి.
- కాళ్లు, చేతులు, భుజములు, తొడలు, పిక్కలు మొదలవు అన్ని శరీర భాగాల్లోనే కండరాలు శక్తివంతంగా సుందరంగా కనిపిస్తాయి.
- మానసిక శాంతి మంచి నిద్రను కలగజేస్తుంది.



నేటి యువత తెలుసుకోవాలి



ప్రస్తుత తరుణంలో యువత ఆరోగ్యంపై శ్రద్ధ చూపడం లేదు. చిన్న చిన్న విషయాలకే ఒత్తిడికి లోనే తమ ప్రాణాల మీదికి తెచ్చుకుంటున్నారు. ప్రతి రోజు సూర్య నమస్కారాలు చేసినట్లయితే సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందుతారు. అందుకు శివ హోమ్ యోగ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ సెంటర్ ఆధ్వర్యంలో శనివారం ఉదయం జీడిమెట్ల సరోజిని గార్డెన్‌లో ఉచితంగా 108 సూర్య నమస్కారాలు నేర్పించి, వాటి ప్రాముఖ్యతను తెలియజేస్తాం.

– కె.రవీందర్ రాజు, యోగా శిక్షకుడు

20 ఏళ్లుగా చేస్తున్నా..



చిన్న పెద్ద తేడా లేకుండా ఇంట్లో ప్రతి ఒక్కరూ సూర్య నమస్కారాలు చేయాలి. గత 20 సంవత్సరాల నుంచి ప్రతిరోజు ఉదయం నేను చేస్తున్న. నేను 61 ఏళ్లు ఉన్నప్పటికీ ఇప్పటి వరకు బీపీ, షుగర్ దరి చేరలేదు.

– లక్ష్మణ్, మీనాక్షి ఎస్టేట్

సూర్య నమస్కార మంత్రం..

ఓం మిత్రాయ నమః ఓం రవయే నమః
ఓం సూర్యాయ నమః ఓం భానవే నమః
ఓం ఖగయ నమః ఓం పూష్ణే నమః
ఓం హిరణ్యగర్భాయ నమః
ఓం మరీచయే నమః ఓం ఆదిత్యాయ నమః
ఓం సావిత్రే నమః ఓం ఆర్కాయ నమః
ఓం భాస్కరాయ నమః
ఈ మంత్రం జపిస్తూ సూర్య నమస్కారాలు (12 ఆసనాల మిళితం) చేస్తారు.

ప్రభుత్వానికి అనుకూలంగా భజన చేయాలా?

- జిల్లా వైఎస్సార్‌టీపీ అధ్యక్షుడు సురేష్‌రెడ్డి
- వరంగల్ సీపీ షరతులు హాస్యాస్పదం



కుత్బుల్లాపూర్: వైఎస్సార్‌టీపీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల పాదయాత్రకు అనుమతించిన వరంగల్ సీపీ దేశంలోని ఎక్కడా ఏ రాజకీయ పార్టీకి విధించని షరతులు పెట్టడం హాస్యాస్పదంగా ఉందని మేడ్చల్–మల్కాజ్‌గిరి జిల్లా వైఎస్సార్‌టీపీ అధ్యక్షుడు సురేష్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో పోలీస్ యంత్రాంగం పూర్తిగా ప్రభుత్వానికి కొమ్ముకాస్తున్నట్లుగా ఉందన్నారు. వైఎస్ షర్మిల ప్రభుత్వ వైఫల్యాలపై మాట్లాడొద్దని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ప్రభుత్వానికి అనుకూలంగా భజన చేస్తూ మాట్లాడాలా అని విమర్శించారు. ముఖ్యమంత్రి, మంత్రులు, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఇతర నాయకులను విమర్శిస్తే కేసులు పెడతారా? దీనిపై వరంగల్ సీపీ వివరణ ఇవ్వాలన్నారు. ఖమ్మంలో జరిగిన బీఆర్ఎస్ పార్టీ బహిరంగ సభలో విమర్శలను పరిశీలించి రాబోయే రోజుల్లో బీఆర్ఎస్ పార్టీకి పోలీసులు అనుమతుల విషయమై షరతులు విధిస్తారా? అని ప్రశ్నించారు. పోలీసులు ఎన్ని షరతులు పెట్టినా ప్రజలు తమపై షరతులు లేని అభిమానం చూపిస్తున్నారని అన్నారు. షరతులతో రాష్ట్ర ప్రభుత్వానికి ఎంత అభద్రతా భావం ఉందో ప్రజలకు అర్థమవుతోందన్నారు. నియంత పాలనను సాగనంపడానికి వైఎస్ షర్మిలను ముఖ్యమంత్రిని చేయడానికి తెలంగాణ ప్రజానీకం సిద్ధంగా ఉందని సురేష్‌రెడ్డి పేర్కొన్నారు.

పరీక్షా పే చర్చపై అవగాహన


విద్యార్థులకు పరీక్షా పే చర్చపై అవగాహన కల్పిస్తున్న బీజేపీ నాయకులు

దుండిగల్: ఒత్తిడి లేని విధంగా విద్యనభ్యసించడమే లక్ష్యంగా ప్రధాని నరేంద్రమోదీ పరీక్షా పే చర్చ కార్యక్రమాన్ని చేపట్టారని దుండిగల్ మున్సిపల్ బీజేపీ అధ్యక్షుడు మల్లేష్‌యాదవ్ అన్నారు. శుక్రవారం దుండిగల్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. పరీక్షా పే చర్చలో భాగంగా ప్రధాని మోదీ ఆన్‌లైన్‌లో విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో ఇంటరాక్ట్ అవుతారని పేర్కొన్నారు. ఒత్తిడిని జయించి పరీక్షలు ఎలా రాయాలి? భయాందోళనలు దూరం చేసి పరీక్షలకు ఎలా సన్నద్ధం అవ్వాలనే విషయాలపై ప్రధాని సలహాలు, సూచనలు ఇస్తారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మేడ్చల్ జిల్లా ప్రధాన కార్యదర్శి విగ్నేష్, శ్యామ్‌రావు, పీసరి కృష్ణారెడ్డి, ఆకుల విజయ్, సదానందం, పిట్ల లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

ఫంక్షన్‌హాల్ అందుబాటులోకి తేవడంలో నిర్లక్ష్యం


భగత్‌సింగ్‌నగర్‌లోని మల్టీపర్పస్ ఫంక్షన్‌హాల్‌ను సందర్శిస్తున్న శ్రీశైలంగౌడ్

- మాజీ ఎమ్మెల్యే, బీజేపీ నేత కూన శ్రీశైలంగౌడ్

చింతల్: మంత్రి ప్రారంభించిన మల్టీపర్పస్ ఫంక్షన్‌హాల్ ఏడాదిగా అందుబాటులోకి రాకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని మాజీ ఎమ్మెల్యే, బీజేపీ నేత కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. శుక్రవారం చింతల్ డివిజన్ భగత్‌సింగ్‌నగర్‌లోని మల్టీపర్పస్ ఫంక్షన్‌హాలును ఆయన సందర్శించి మాట్లాడారు. రూ.4కోట్లు వెచ్చించి ఫంక్షన్‌హాలు నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలు పాటించలేదన్నారు. ఫంక్షన్‌హాల్‌లో సౌకర్యాలు లేవని, కనీసం మరుగుదొడ్లు, తాగునీటి వసతిని కల్పించపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. 15 రోజుల్లో అందుబాటులోకి తేవాలని డిమాండ్ చేశారు. బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే భగత్‌సింగ్‌నగర్ వెల్ఫేర్ అసోసియేషన్‌కు ప్రత్యేక భవనాన్ని కేటాయిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ డివిజన్ అధ్యక్షుడు పత్తి సతీష్, ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సదానందం, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు గరిగె శేఖర్ ముదిరాజ్, భావి గడ్డ రవి, జిల్లా కార్యదర్శి జగన్ మోహన్‌రావు, డివిజన్ ఇంచార్జ్ సుశాంత్ గౌడ్ తదితరులు ఉన్నారు.

అగ్నిప్రమాదం


మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

దుండిగల్: దుండిగల్ మున్సిపాలిటీ పరిధి మల్లంపేట్‌లోని కోడిగుడ్లను పొదిగే పరికరాల తయారీ కంపెనీలో శుక్రవారం అగ్ని ప్రమాదం సంభవించింది. షార్ట్ సర్క్యూట్‌తో ప్రమాదం సంభవించగా వెంటనే సమాచారం అందుకున్న జీడిమెట్ల ఫైర్‌స్టేషన్ సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. ఈ అగ్ని ప్రమాదంలో రూ.4లక్షల ఆస్తినష్టం వాటిల్లినట్లు కంపెనీ యాజమాన్యం పేర్కొంది. కాగా ప్రమాద విషయమై దుండిగల్ పోలీసులకు ఎటువంటి ఫిర్యాదు అందలేదు.

దుండిగల్ కౌన్సిల్ ఏర్పడి మూడేళ్లు పూర్తి

దుండిగల్: దుండిగల్ మున్సిపల్ కౌన్సిల్ ఏర్పడి మూడేళ్లు పూర్తయిన సందర్భంగా శుక్రవారం చైర్‌పర్సన్ సుంకరి కృష్ణవేణి ఆధ్వర్యంలో కౌన్సిలర్లను సన్మానించారు. అదే విధంగా గతంలో కమిషనర్లుగా పని చేసిన ఏ.సురేష్, ఎంఎస్ఆర్ జ్యోతి, భోగీశ్వర్లుకు సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైస్‌చైర్మన్ పద్మారావు, కమిషనర్ సత్యనారాయణరావు, కౌన్సిలర్లు సుంకరి కృష్ణ, కుంటి అరుణ, అమరం గోపాల్‌రెడ్డి, జక్కుల కృష్ణయాదవ్, ముడిమెల రాముగౌడ్, కోలా సాయిబాబాయాదవ్, బండారి మహేందర్‌యాదవ్, బొంగునూరి సవిత, మైసిగారి సుజాత, శివనూరి నవనీత, ఎల్లుగారి సత్యనారాయణ, నర్సింగం భరత్‌కుమార్, నర్సారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, పల్సునూరి మౌనిక, వెంబడి వనిత, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజలు అధికారులకు పూర్తి సహకారం అందిస్తారు


మున్సిపల్ చైర్మన్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న కమిషనర్ జ్యోతి

కుత్బుల్లాపూర్: కొంపల్లి మున్సిపల్ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టి మూడేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా చైర్మన్ సన్న శ్రీశైలంయాదవ్, మాజీ ఎంపీపీ సన్న కవితను శుక్రవారం మున్సిపల్ కమిషనర్ ఎంఎస్ఆర్ జ్యోతి ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి బొకే అందజేశారు. కొత్తగా ఏర్పడ్డ మున్సిపాలిటీలో తాను మొదటి కొంపల్లి మున్సిపల్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టినందుకు ఎంతో గర్వంగా ఉందన్నారు. ఈ ప్రాంత ప్రజలు అధికారులకు పూర్తి సహకారం అందిస్తారని జ్యోతి ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రజల సహకారం, పాలక మండలి ఆమోదంతో ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుందని అందుకు పూర్తి బాధ్యత తనదేనని చైర్మన్ సన్న శ్రీశైలంయాదవ్ 'సాక్షి'తో అన్నారు.

కార్పొరేషన్ అభివృద్ధికి సహకారం ఎప్పుడూ ఉంటుంది



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వివేకానంద్

నిజాంపేట్: నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ అభివృద్ధి పథంలో దూసుకువెళ్తోందని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. కార్పొరేషన్ ఏర్పడి మూడేళ్లు పూర్తయిన నేపథ్యంలో శుక్రవారం కేజీఆర్ కన్వెన్షన్ హాల్‌లో మేయర్ కొలన్ నీలారెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై ప్రగతి నివేదికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... మూడేళ్ల కాలంలో నిజాంపేట్ కార్పొరేషన్ అభివృద్ధి విషయంలో ఎన్నో అద్భుతాలు సాధించిందన్నారు. మౌలిక వసతులు ఎంతో మెరుగుపడ్డాయని పేర్కొన్నారు. కార్పొరేషన్ అభివృద్ధికి తన సహాయ సహకారాలు ఎల్లప్పుడు ఉంటాయన్నారు.

- అనంతరం మేయర్ నీలారెడ్డి మాట్లాడుతూ.. కార్పొరేషన్ పరిధిలో రూ.247 కోట్ల అభివృద్ధి పనులు ప్రారంభించగా దాదాపు రూ.160 కోట్ల పనులు పూర్తయ్యాయని తెలిపారు. పది బస్తీ దవాఖానాలకు రూపకల్పన చేయగా ఒకటి అందుబాటులోకి వచ్చిందన్నారు. మరో 5 ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. మిగిలిన నాలుగు నిర్మాణ దశలో ఉన్నాయని పేర్కొన్నారు. కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ పథకం కింద 319 మందికి లబ్ధి చేకూరిందన్నారు.
- అభివృద్ధి పనుల్లో భాగంగా పార్కులు, క్రీడా ప్రాంగాలు, కమ్యూనిటీ భవనాలు, ఓపెన్ జిమ్స్‌లను ఏర్పాటు చేశామని తెలిపారు. వరద ముంపును తట్టుకునే వీలుగా ఎస్ఎన్‌డీపీ నాలా పనులు చురుగ్గా కొనసాగుతున్నాయని అన్నారు. భవిష్యత్‌లో లోతట్టు ప్రాంతాల ప్రజలకు సురక్షితంగా ఉండేందుకు దోహద పడనుందన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ కమిషనర్ రామకృష్ణారావు, డిప్యూటీ మేయర్ ధన్‌రాజ్‌యాదవ్, కార్పొరేటర్లు, కో–ఆప్షన్ సభ్యులు, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

ముగిసిన చిత్తారమ్మదేవి జాతర


అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే శ్రీశైలంగౌడ్

సుభాష్‌నగర్: గాజులరామారంలో 8 రోజుల నుంచి జరుగుతున్న చిత్తారమ్మదేవి జాతర ముగిసింది. శుక్రవారం అమ్మవారి ఓడిబియ్యంతో జరిగిన అన్నదాన కార్యక్రమాన్ని బీజేపీ నేత, మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ ముఖ్యఅతిథిగా హాజరై ఆలయ కమిటీ చైర్మన్ కూన అంతయ్యగౌడ్‌తో కలిసి ప్రారంభించారు. ఉదయం ప్రారంభమైన అన్నదానం సాయంత్రం వరకు కొనసాగింది. అన్నదానానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జీడిమెట్ల పోలీసులు బందోబస్తు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

శాంతి భద్రతల పరిరక్షణకు మెరుగైన పోలీసింగ్

మేడ్చల్, బాలానగర్ డీసీపీలుగా సందీప్ గోనె, శ్రీనివాసరావు బాధ్యతలు


మేడ్చల్ డీసీపీ కార్యాలయానికి భూమి పూజ చేస్తున్న డీసీపీ సందీప్ గోనె

కుత్బుల్లాపూర్: ప్రజా అవసరాలకు ఉపయోగపడేలా పరిపాలన సౌలభ్యం కోసం ప్రభుత్వం కొత్తగా ఏర్పాటు చేసిన జోన్ల డీసీపీలు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. బాలానగర్ డీసీపీగా విధులు నిర్వర్తించిన సందీప్ గోనె మేడ్చల్ డీసీపీగా బాధ్యతలు చేపట్టారు. సైబరాబాద్ ట్రాఫిక్ డీసీపీగా ఉన్న టి.శ్రీనివాసరావు బాలానగర్ డీసీపీగా బాధ్యతలు చేపట్టారు.

కొత్తగా ఏర్పాటైన డీసీపీల పరిధిలు ఇలా...

- బాలానగర్ డీసీపీ పరిధిలో జీడిమెట్ల, జగద్గిరిగుట్ట, సనత్‌నగర్, బాలానగర్ ఏసీపీ పరిధిలో ఉండగా, వాటితో పాటు కూకట్‌పల్లి ఏసీపీ పరిధిలోని, కేపీహెచ్‌బీ, బాచుపల్లి పోలీస్‌స్టేషన్‌లు ఉంటాయి. అదే విధంగా ఈ పోలీస్‌స్టేషన్ల పరిధిలో అల్లాపూర్ కొత్త పోలీస్‌స్టేషన్‌ను ఏర్పాటు చేశారు.
- మేడ్చల్ డీసీపీ పరిధిలో పేట్‌బషీరాబాద్ ఏసీపీ పరిధిలో ఉన్న శామీర్‌పేట్, అల్వాల్, పేట్‌బషీరాబాద్, జినో వ్యాల్యూ (కొత్త పోలీస్ స్టేషన్), మేడ్చల్ ఏసీపీ పరిధిలో మేడ్చల్, దుండిగల్‌తో పాటు కొత్తగా ఏర్పడే సూరారం పోలీస్ స్టేషన్ ఉంటుంది.

డీసీపీ కార్యాలయానికి భూమిపూజ..

నూతనంగా మేడ్చల్ డీసీపీగా బాధ్యతలు చేపట్టిన సందీప్ గోనె గతంలో ప్రభుత్వం కేటాయించిన స్థలంలో భూమిపూజ చేశారు. డీసీపీ కార్యాలయం పూర్తి చేసి ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా తీర్చిదిద్దుతామని పేర్కొన్నారు. నేరాల అదుపునకు తన వంతు కృషి ఉంటుందన్నారు. తప్పకుండా ప్రజల సహకారం ఉండాలని కోరారు. సందర్భంగా ఏసీపీ రామలింగరాజుతో పాటు ఆయా పోలీస్‌స్టేషన్ల ఎస్‌హెచ్‌ఓలు ప్రశాంత్, రాజశేఖర్ రెడ్డి, గంగాధర్, డీఐ లక్ష్మీనారాయణరెడ్డి ఈ భూమి పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు.

మెరుగైన పోలీసింగ్‌ను అందిస్తాం: బాలానగర్ డీసీపీ శ్రీనివాస్‌రావు



బాలానగర్ డీసీపీ పరిధిలో శాంతి భద్రతలను పరిరక్షించేందుకు మెరుగైన పోలీసింగ్‌ను నిర్వహిస్తామని బాలానగర్ డీసీపీగా బాధ్యతలు చేపట్టిన శ్రీనివాస్‌రావు అన్నారు. ప్రజలకు చేరువయ్యేలా ఫ్రెండ్లీ పోలింగ్‌తో పాటు స్థానికంగా నేరాలను అదుపు చేయడానికి గస్తీని మెరుగు పరుస్తామని పేర్కొన్నారు.